రోడ్డు తవ్వి వదిలేశారు..



కృషినగర్‌లో తవ్విన రోడ్డు

మియాపూర్ : అభివృద్ధి పనుల్లో అలసత్వం ప్రజల పాలిట శాపంగా మారింది. మియాపూర్‌లోని కృషినగర్ కాలనీలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పైపులైన్ నిమిత్తం రోడ్డును తవ్వివదిలేశారు. సిమెంట్ రోడ్డును తవ్విన ప్రదేశంలో పెద్ద గుంతలు దర్శనమిస్తున్నాయి. దీనికితోడు రోడ్డు పక్కనే పైపులను వదిలేశారు. దీంతో ఎప్పుడు ఈ ప్రమాదం జరుగుతుందోనని స్థానిక ప్రజలు భయాందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి త్వరగా పనులు పూర్తయ్యేలా చూడాలని కోరుతున్నారు.

11న నిధి ఆప్‌కే నిఖత్

మూసాపేట: కూకట్‌పల్లిలోని ప్రావిడెంట్ ఫండ్ (పిఎఫ్) కార్యాలయం ఆధ్వర్యంలో నిధి ఆప్‌కే నిఖత్ నిర్వహించనున్నట్లు పీఎఫ్ కమిషనర్ వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ నెల 11వ తేదీ ఉదయం 10 గంటలకు కూకట్‌పల్లి ప్రశాంత్‌నగర్‌లోని బస్ టెర్మినల్‌లో గల రెండవ అంతస్థులోని పీఎఫ్ కార్యాలయంలో ఈ కార్యక్రమం ఉంటుందని, ఖాతాదారులు తమ సమస్యలను పరిష్కరించుకోవటమే కాక సలహాలు, సూచనలు స్వీకరిస్తామన్నారు. కూకట్‌పల్లి, మియాపూర్, లింగంపల్లి, బీహెచ్ఇఎల్, జీడిమెట్ల, సనత్‌నగర్ ఖాతాదారులు పాల్గొనవచ్చని తెలిపారు.

'మహాలక్ష్మీ' ప్రశంసలు



శేరిలింగంపల్లి జోన్‌బృందం: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలైన ఆరు గ్యారంటీలలో రెండింటిని ప్రభుత్వం శనివారం అమలు చేసింది. తెలంగాణ రాష్ట్రంలో మహిళా సాధికారత దిశగా తొలిఅడుగు పడింది. అందులో ఆర్టీసీ బస్సులో మహిళలకు ఉచిత ప్రయాణం ప్రధానమైనది. అసెంబ్లీ వద్ద రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించగా, కొండాపూర్‌లోని ఏరియా ఆస్పత్రి వద్ద రంగారెడ్డిజిల్లా కలెక్టర్ భారతి హోలికేరి ప్రారంభించారు. దీంతో మధ్యాహ్నం తర్వాత ఆర్టీసీ బస్సులో మహిళలకు ఉచిత ప్రయాణాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళలు సంతోషం వ్యక్తం చేశారు. వారం రోజుల తర్వాత ప్రత్యేక కార్డులను మహిళలకు అందించేందుకు ఏర్పాట్లు చేస్తామని అధికారులు ప్రకటించారు.



నెలవారీ ఖర్చు ఆదా



బస్సులో ఉచిత ప్రయాణం చాలా సంతోషం. నెలవారీ ఖర్చులు ఆదా అవుతాయి. పేద, మధ్య తరగతి ప్రజలకు ఎక్కువగా ఉపయోగకరంగా ఉంటుంది.

-కిష్టమ్మ మియాపూర్

చాలా మంచి నిర్ణయం

ప్రభుత్వం మాలాంటి మహిళలందరికీ ఉచిత బస్సు ప్రయాణం ఇవ్వడం ఎంతో సంతోషం. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలలో ఇది చాలా మంచి నిర్ణయం .ప్రతీనెలా డబ్బులు మిగులుతాయి.

-కోటేశ్వరమ్మ, లింగంపల్లి

ఆనందంగా ఉంది



ఆర్టీసీ బస్సులో డబ్బులు తీసుకోలేదు. మహాలక్ష్మీ ఉచిత ప్రయాణ టికెట్ ఇచ్చారు. ప్రభుత్వం ఇలాంటి నిర్ణయం తీసుకోవడం ఆనందంగా ఉంది.

-లక్ష్మీ, గుల్‌మోహర్‌పార్కు

ప్రైవేట్ ఉద్యోగులకు ఎంతో ఉపయోగం



మహిళలకు ఆర్టీసీ బస్సు ఉచిత ప్రయాణం ఇవ్వడం సంతోషంగా ఉంది. ప్రైవేట్ ఉద్యోగులకు ఎంతో ఉపయోగం. పేద, మధ్య తరగతి మహిళలం చాలా అభినందిస్తున్నాం. కేసీఆర్ ప్రగతిభవన్ చుట్టు కంచె వేసి ఎవరినీ రానిచ్చేవారు కాదు. ఇప్పుడు ప్రజాభవన్‌కు వెళ్ళొచ్చనడం ఆనందంగా ఉంది.

-నాగమణి, శాంతినగర్, చందానగర్

పథకం మధ్యలో ఆపివేయకుండా చూడాలి



మహిళలకు ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణం తీసుకువచ్చినందుకు చాలా కృతజ్ఞతలు. పురుషులకు కూడా 50 శాతం రాయితీ ఇస్తే బాగుంటుంది. అయితే ఆర్టీసీకి నష్టం వస్తుందని ఈ పథకాన్ని మధ్యలో నిలిపివేయకుండా చూడాలి.

-కళ, చందానగర్

మూడోసారి.. ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసిన గాంధీ

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి నియోజకవర్గం నుంచి మూడోసారి ఎమ్మెల్యేగా ఎన్నికైన ఆరెకపూడి గాంధీ అసెంబ్లీలో శనివారం ప్రమాణ స్వీకారం చేశారు. నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు, సంక్షేమ కార్యక్రమాలు అందించేందుకు తన వంతు కృషి చేస్తానని గాంధీ పేర్కొన్నారు. హ్యాట్రిక్ విజయం అందించిన ప్రజలకు రుణపడి ఉంటానన్నారు.

40 రోజులు.. క్రీడాపోటీలు ప్రారంభం



క్రీడా పోటీల్లో పాల్గొన్న కాలనీవాసులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని గేటెడ్ కమ్యూనిటీ కాలనీలలో 40 రోజుల పాటు జరిగే క్రీడా పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా తెల్లాపూర్ అసోసియేషన్ అధ్యక్షులు ఈశ్వరగారి రమణ మాట్లాడుతూ కాలనీవాసులలో మరింత స్నేహ భావం పెంచాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆయా కాలనీలవాసులు ఎంత ఉత్సాహంగా పోటీల్లో పాల్గొంటున్నారని తెలిపారు.

శ్మశానవాటిక సందర్శన



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పుష్ప నగేష్

రామచంద్రాపురం (పటాన్‌చెరు): రామచంద్రాపురం పట్టణంలోని హిందూ శ్మశానవాటికను శనివారం కార్పొరేటర్ పుష్ప నగేష్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇచ్చిన హామీ మేరకు శ్మశానవాటికను అభివృద్ధి చేయడం జరిగిందని తెలిపారు.

ఘనంగా సోనియాగాంధీ జన్మదిన వేడుకలు



పేదలకు దుప్పట్లు అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు జగదీశ్వర్‌గౌడ్ తదితరులు



సోనియా గాంధీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

మియాపూర్ : మియాపూర్‌లోని న్యూ కాలనీలో కాంగ్రెస్ నాయకులు సాంబశివరావు ఆధ్వర్యంలో సోనియా గాంధీ జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు వి.జగదీశ్వర్‌గౌడ్ హాజరై పేద ప్రజలకు దుప్పట్లు అందజేశారు. అనంతరం నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ హయాంలో అన్ని వర్గాలకు న్యాయం

పటాన్‌చెరు టౌన్: తెలంగాణ తల్లి అంటే సోనియా గాంధీ అని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షులు నర్సింహారెడ్డి అన్నారు. శనివారం పట్టణంలో సోనియా గాంధీ జన్మదిన వేడుకలు శనివారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. సోనియాగాంధీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన 6 గ్యారంటీల్లో రెండు మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణం, రాజీవ్ ఆరోగ్యశ్రీ రూ.10 లక్షలు అమలు చేయడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డీసీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి చిన్న ముదిరాజ్, కార్యదర్శి సామయ్య, మాజీ ఎంపీటీసీ గోపాల్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ రాజిరెడ్డి నాయకులు పాషా, యువరాజ్ మోరే, కుంచాల కిషన్, మైనార్టీ నాయకుడు హబీబ్, జాని రసూల్ శ్రీనివాస్, ఆసిఫ్ ,ఇబ్రహీం పాల్గొన్నారు.

భళా.. నృత్య ప్రదర్శన



మాదాపూర్: శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు కార్యక్రమాలలో భాగంగా శనివారం అనురాధ శిష్యబృందం భరతనాట్య ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. అలాగే శంకర్ శాక్సోఫోన్‌పై కచేరి చేశారు. ఇందులో మూషికవాహన, పుష్పాంజలి, సరస్వతి, భో శంభో, తిల్లాన, అలరిపు, కాలభైరవాష్టకం, శబ్దం, దుర్గ, గురువందన తదితర అంశాలను కళాకారులు అనికా, దీక్షిత, శాన్వి, రుచిత, వర్షలు ప్రదర్శించారు.

చీరలు పంపిణీ

ఆల్విన్‌కాలనీ: సోనియాగాంధీ జన్మదినాన్ని పురస్కరించుకొని శనివారం వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని రిక్షాపుల్లర్స్ కాలనీలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కంటెస్ట్ కార్పొరేటర్ బాషిపాక నాగమణి యాదగిరి ఆధ్వర్యంలో జగదీశ్వర్ గౌడ్ మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, భానుప్రసాద్, మహేష్ గౌడ్, చిరుమర్తి రాజు, ఏకాంత్‌గౌడ్, యాదగిరి యాదవ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే గాంధీకి అభినందనలు



గాంధీని కలిసిన పీవీఆర్ సాయిహిల్స్ కాలనీవాసులు

భాగ్యనగర్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని పీవీఆర్ సాయిహిల్స్ కాలనీవాసులు, బీఆర్‌యస్ నాయకులు శనివారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీకి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడోసారి భారీ మెజార్టీతో గెలిపించిన శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రజలందరికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధికి మరింత కృషి చేస్తానని పేర్కొన్నారు.

సత్యనారాయణస్వామి వ్రతాలు

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారంలోని రంగనాయక స్వామి దేవాలయంలో శనివారం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అనంతరం అన్నదానం చేశారు.

పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్స్ పంపిణీ

బంజారాహిల్స్: బద్రి విశాల్ పన్నాలాల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేద మెరిట్ విద్యార్థుల కోసం స్కాలర్‌షిప్స్ పంపిణీ కార్యక్రమం శనివారం బంజారాహిల్స్‌లో నిర్వహించారు. డిగ్రీ, ఎంబీఏ. ఎంబీబీఎస్ తదితర కోర్సుల్లో చదువుతున్న 600మంది విద్యార్థులకు రూ.60లక్షల విలువైన స్కాలర్‌షిప్స్‌కు సంబంధించిన చెక్కులను బద్రివిశాల్ పన్నాలాల్ ట్రస్ట్ చైర్మన్ శరత్‌పిట్టీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శరత్‌పిట్టీ మాట్లాడుతూ..తమతండ్రి బద్రివిశాల్ ఆశయాలను కొనసాగిస్తూ అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఉచిత ఆరోగ్య శిబిరాలు, కంటి సర్జరీలు, డయాలసిస్ కేంద్రాల ఏర్పాటు, వృద్ధాశ్రమాల్లో మౌలిక వసతులు, వితంతువులకు నెలనెలా ఆర్థిక సాయం, 80 శాతం కంటే ఎక్కువ మార్కులు సాధించే పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్స్ తదితర కార్యక్రమాల కోసం ఏటా తమ ట్రస్ట్ తరపున రూ. 2.5 కోట్లు ఖర్చు చేస్తామని వివరించారు. కరోనా సమయంలో వేలాదిమంది కార్మికులకు వ్యాక్సిన్ డోసులు వేయించడంతో పాటు వారికి సరుకులను అందజేశామని పేర్కొన్నారు. ట్రస్ట్ సభ్యులు విజయ్‌కుమార్, అగర్వాల్‌సేవా దళ్ ప్రతినిధులు రతన్‌గుప్తా, అజిత్ గుప్తా, కైలాష్‌కేడియా, ప్రదీప్ అగర్వాల్,వినయ్ అగర్వాల్, ఊర్మిళ అగర్వాల్, సుధీర్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

నిత్యం తవ్వకాలు.. ట్రాఫిక్ సమస్య



మంజీరా రోడ్డులో రోడ్డును మూసివేసి పనులు చేస్తున్న దృశ్యం

హఫీజ్‌పేట్ : చందానగర్, హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని మంజీరారోడ్డులో నిత్యం పైప్‌లైన్ లీకేజీలు ఉత్పన్నమవుతున్నాయి. దీంతో పైప్‌లైన్ మరమ్మతుల కోసం రోడ్డును తాత్కాలికంగా మూసివేస్తున్నారు. రోడ్డు మూసివేతతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు తెలిపారు. ఉదయం, సాయంత్రం ట్రాఫిక్ రద్దీ చాలా అధికంగా ఉంటుంది. ఇటీవల ఎన్నికల ముందు నూతన పైప్ లైన్ పనుల కోసం స్థానిక ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. వెంటనే మంజీరారోడ్డులో నూతన పైప్‌లైన్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఘనంగా రుద్రహోమం



సాయిదత్త గణపతి ఆలయంలో రుద్రహోమం

రాయదుర్గం: వేదబ్రాహ్మణుల మంత్రోచ్చారణలు, భక్తుల జయజయధ్వానాల మధ్య రుద్రహోమంను శనివారం వైభవంగా నిర్వహించారు. టెలికామ్‌నగర్‌లోని సాయిదత్త గణపతి ఆలయంలో గణపతి పూజలతో ప్రత్యేక కార్యక్రమాలను ప్రారంభించారు. అనంతరం అమృతేశ్వరుడికి ప్రత్యేకంగా 21 ద్రవ్యాలతో విశేష అభిషేకం చేశారు. అనంతరం రుద్ర హోమం పూర్ణాహుతి జరిపారు.అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన చేశారు. ఆలయ అర్చకులు వివివిఎస్‌శర్మ, ఆలయ నిర్వాహకులు డి నరేందర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

మురుగు కంపు..



అపరిశుభ్రంగా మేళ్లచెరువు పరిసరాలు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని మేళ్ల చెరువు అపరిశుభ్రతకు కేరాఫ్‌కు మారింది. దాంతో చెరువు చుట్టుపక్కల నివాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో మున్సిపల్ అధికారులు ఈ సమస్యను పట్టించుకోకపోవడంతో స్థానికులే స్వయంగా చెరువు పరిసరాలను శుభ్రం చేసుకున్నారు.తిరిగి చెరువు పరిసరాలు చెత్తాచెదారానికి నిలయంగా మారాయి. దుర్వాసనతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్యను వెంటనే పరిష్కరించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనలో వేద పండితులు, ఆలయ కమిటీ ప్రతినిధులు

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవం

శ్రీనగర్‌కాలనీ: ఎర్రగడ్డ హేమావతీనగర్‌లోని శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న శివాలయం ఎదురుగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ప్రతిష్ఠాపనకు వందలాదిగా భక్తులు హాజరయ్యారు. వేద పండితులచే కార్యక్రమాన్ని కనులపండువగా చేపట్టారు. అనంతరం హోమం, భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రెసిడెంట్ డాక్టర్ గూడూరి చెన్నారెడ్డి, విజయలక్ష్మి, రవిగౌడ్, కేహెచ్ఎస్ శర్మ, శ్రీనివాస్, అనురాధ, రాధిక, జనార్థన రావు, చింతపల్లి వంశీ, శోభారాణి, ఇందిరా, డా.పద్మప్రియ, రాధాకృష్ణ, శ్రీధర్ రెడ్డి, హరిశంకరశర్మ పాల్గొన్నారు.

70 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



పట్టుబడిన బియ్యంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు

పటాన్‌చెరు టౌన్: రెండు గోదాంలలో నిల్వ ఉంచిన 70 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకుని బీడీఎల్ పోలీసులకు అప్పగించిన సంఘటన పటాన్ చెరు మండలం పాశమైలారంలో చోటుచేసుకుంది. టాస్క్‌ఫోర్స్ ఎస్‌ఐ సాయిలు కథనం ప్రకారం.. పాశమైలారం పారిశ్రామికవాడలో వివిధ చోట్ల నుండి రేషన్ బియ్యాన్ని పోగుచేసి రెండు గోదాంలో జమ చేసి వాటిని కర్ణాటక ,మహారాష్ట్రలకు తరలిస్తున్నారని విశ్వసనీయ సమాచారం వచ్చిందన్నారు.దీంతో శనివారం సిబ్బందితో కలసి దాడులు నిర్వహించి, రెండు గోదాంలో నిల్వ ఉంచిన సుమారు 70 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని, అక్కడ పనిచేస్తున్న ఇద్దరు హమాలీలను పట్టుకుని బీడీఎల్ పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు.అయితే నిర్వాహకుడు ఇస్నాపూర్‌లో ఉంటున్న శంకర్ పరారీలో ఉన్నట్లు తెలిపారు.

అన్నమయ్యపురంలో నృత్యార్చన



మాదాపూర్: అన్నమయ్యపురంలో నిర్వహించే అన్నమయ్య స్వరార్చనలో భాగంగా శనివారం సాయి సన్నిధి కూచిపూడి డ్యాన్స్ అకాడమీ గురువు రాధిక శిష్య బృందం అన్నమయ్య కీర్తనలకు నృత్య రూపకాలతో అలరించారు. ఇందులో గణేశ పంచరత్నం, ముద్దుగారే యశోద, భోగములు మాయా విలాసములు, సురులకు నరులకు అంటూ కళాకారులు నృత్యప్రదర్శనతో అలరించారు. కార్యక్రమంలో కళాకారులు తన్మయి, ప్రణతి, దివ్యశ్రీ, క్రిష్టి, తన్విశ్రీ, ఉషసాయి, అవంతిక, ప్రజ్వల, ప్రణవి సహస్ర, రీతువర్మలు పాల్గొన్నారు. కళాకారులను సంస్థ నిర్వాహకులు జ్ఞాపికలతో సత్కరించారు.

కేసీఆర్ కోలుకోవాలని ప్రత్యేక పూజలు



హఫీజ్‌పేట్ : మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు త్వరగా కోలుకోవాలని శనివారం చందానగర్ డివిజన్ పరిధిలోని శిల్పా ఎన్‌క్లేవ్‌లోని గణపతి ఆలయంలో కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. త్వరితగతిన ఇంటికి తిరిగి రావాలని ఆ దేవుడిని ప్రార్థించామన్నారు.

చెరువు సుందరీకరణ పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి తదితరులు

హఫీజ్‌పేట్ : చందానగర్ డివిజన్ పరిధిలోని రాజేందర్‌నగర్ బక్షికుంట చెరువు సుందరీకరణ పనులను శనివారం స్థానిక కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని రాజేందర్‌రెడ్డినగర్ కాలనీలో సిఎస్ఆర్ ఫండ్స్‌తో పాటు ఫెనోమ్ పీపుల్ ఐటీ కంపెనీ, బైరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సుందరీకరణ పనులు చేపట్టడం జరిగిందన్నారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. చెరువులో ఎటువంటి వ్యర్థాలను పడేయకుండా కాలనీవాసులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

మానవ హక్కుల పరిరక్షణకు కృషి చేయాలి



మాట్లాడుతున్న 'మనూ' ప్రొ.అఫ్రోజ్‌ఆలమ్

రాయదుర్గం: ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల ప్రకటన భారతదేశంతోపాటు చాలా దేశాల రాజ్యాంగాలకు స్ఫూర్తిదాయకమని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ అఫ్రోజ్ ఆలమ్ పేర్కొన్నారు. ప్రపంచ మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని కొండాపూర్ డివిజన్ సఫారీనగర్‌లోని న్యూబ్లూమ్ హైస్కూల్‌లో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామియాదవ్ అధ్యక్షతన మానవ హక్కులపై అవగాహన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది నినాదం 'అందరికీ స్వేచ్ఛ, సమానత్వం, న్యాయం, ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల ప్రకటన వచ్చిందన్నారు. కొంత మంది సంఘసంస్కర్తల కృషి ఫలితంగా ఈ మానవ హక్కులు ఉద్భవించాయని గుర్తు చేశారు. సమాజంలో మానవ హక్కుల ఉల్లంఘన జరిగినప్పుడు పౌర సమాజం చైతన్యవంతమైన మానవ హక్కుల పరిరక్షణకు కృషి చేయాలని ఆయన సూచించారు. పాఠశాల హెచ్‌ఎం కిరణ్, అధ్యాపకులు అసోసియేషన్ సభ్యులు విష్ణుప్రసాద్, శివరామకృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

జేహెచ్‌పీఎస్‌లో ఆకట్టుకున్న 'ప్రతిభ దర్శన్'

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్ తారా బల్ అనే పేరుతో యూకేజీ విద్యార్థులు శనివారం ప్రతిభ ప్రదర్శన కార్యక్రమాన్ని కనులపండుగగా నిర్వహించారు. కార్యక్రమం ఆద్యంతం ఆలోచనాత్మకంగా సాగింది. ప్రతి విద్యార్థిలో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికితీసి, వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడమే తమ ముఖ్య ఉద్దేశమని ప్రాథమిక ప్రధానోపాధ్యాయురాలు బిదు మోహన్ అన్నారు. మంచి కథలు వినడం వల్ల వారిలో ప్రశ్నించే ధైర్యం ,కొత్త ఆలోచనలు రూపుదిద్దుకుంటాయన్నారు. కథలు వినడం వల్ల ఎదుటి వారిని ఎలా గౌరవించాలి, మర్యాదగా ఎలా మాట్లాడాలి వంటివి నేర్చుకుంటారన్నారు. కార్యక్రమంలో స్కూల్ ప్రెసిడెంట్ కె. కృష్ణదేవరావు, ప్రిన్సిపాల్ కాంచనవల్లి పాల్గొన్నారు.